# 10

# హత్య

"ఆమె కళ్ళలో నిప్పులు కురుస్తున్నాయి- క్లోజప్... నడుస్తోంది... అడుగులో అడుగు.... తూచి తూచి... ఖచ్చితంగా... చూపుల్లో దృఢమైన నిర్ణయం... కసి... ట్రాఫిక్ స్క్వేర్‌లో ఆగివున్న ఇంపాలా కారుపై ఆమె చూపులు జ్వలిస్తున్నాయి.... మెల్లగా నడుస్తున్నదల్లా వేగాన్నందుకుంది... అతను ట్రాఫిక్ సిగ్నల్ వంక చూస్తున్నాడు డ్రైవింగ్ సీట్లో కూర్చుని. చటుక్కున చేతిలోని యాసిడ్ జాడిని అతని ముఖంనిండా కుమ్మరించింది. 'ఆ' ...అన్న కేక... వికృతమైన అరుపు. చుట్టూ ఉన్న జనంలో ఓ రకమైన భీతావహమైన సంచలనం.... బీభత్సం. అప్పుడామె... 'బాస్టర్డ్.... ఆడదంటే అంత అలుసా. నీ అందాన్నీ, అహంకారాన్నీ ఎరగా ఎంతమంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తావురా.... అనుభవించు బ్రూట్ అంది... అని చాలా నిబ్బరంగా అక్కడే దిక్కులు చూస్తూ నిలబడ్డ కానిస్టేబుల్ దగ్గరకు వెళ్ళి... కమాన్ అరెస్ట్ మీ... అంది". సీన్ చెప్పుకు పోతున్నాడు ప్రముఖ సినీరచయిత రాఘవ.

ఉద్విగ్నులై ఉత్సుకతతో వింటున్నారు అక్కడున్న మిగిలిన ముగ్గురు... వింటున్న వాడల్లా ఒకడు "బావుంద్సార్... ఆ లేడి కారెక్టర్ సుపర్బ్‌గా వస్తోంది. మనది తప్పకుండా ఓ ఉత్తమ మహిళా చిత్రంగా రూపొందుతుంది. ఒరెయ్ బావా! సార్‌కు ఎనిమిదివేలు అడ్వాన్సివ్వరా. స్క్రిప్ట్ ఎప్పటివరకు చేసి పెడ్తార్‌సార్. మా ప్రొడక్షన్ మేనేజర్ని పంపిస్తాం. ఫార్మాలిటిస్ పూర్తి చేస్తాడు...."

మరొకడు బ్రీఫ్‌కేస్ తెరిచి నోట్లు లెక్క పెడ్తున్నాడు. రాఘవ నోట్ల కరకరలను గమనిస్తూనే ప్రస్తుతం మార్కెట్‌లో విజయవంతమైన ఐదవవారాన్ని పూర్తి చేసుకుని విజయఢంకా మ్రోగిస్తున్న తన ఓ చిత్రం తాలూకు బ్రహ్మాండమైన సీన్ల పుట్టుపూర్వోత్తరాల గురించి కథ మొదలెడుతుండగా-

నిర్విరామంగా బజర్ మ్రోగి అందరి మూడ్‌ను ఖరాబు చేసింది. ఒకడు లేచి విసుగ్గా తలుపు తెరిచాడు. వెంటనే భరించలేని గాఢ విస్కీ వాసన చిమ్ముకొచ్చి దాని వెనుక చింపిరి తల, మాసిన గడ్డం గల ఓ బక్కపలచని మనిషి ఊగుతూ వచ్చి... తూలి పడబోయి, తమాయించుకుని నిలబడి, చుట్టూ నిశ్శబ్దంగా పరికించి... సీరియస్‌గా రాఘవ కూర్చున్న చోటికి నడిచివస్తూ... రెండు చేతులూ జోడించి "న..మ...స్కారం" అని... చాలా అనూహ్యంగా వెక్కివెక్కి ఏడ్వడం మొదలెట్టాడు.

రాఘవ అడ్వాన్స్‌గా అందివ్వబడుతున్న డబ్బును అందుకుంటూ- చింపిరి తల మనిషి వంక పరమ అసహ్యంగా ఓ చూపు చూసి 'నమస్కారం.... ఏమిటీ' అన్నాడు ఎంతో అసహనంగా.

"రాఘవ గారూ... ఓ సాటి రచయితగా... కవిగా అర్థిస్తున్నాను... నా బిడ్డకు సీరియస్‌గా ఉంది. దవాఖానలో చూపించాలి... ప్లీజ్... మీ కాళ్ళు పట్టుకుంటాను. ఒక్క వందరూపాయలివ్వండి... మళ్ళీ పువ్వుల్లో పెట్టి..." మాటలను దుఃఖం మింగేస్తోంది.

రాఘవ ఇబ్బందిగా ముఖం పెట్టి... "ఏడికో వంద రూపాయలివ్వండ్సార్..." అన్నాడు... అని "ప్లీజ్ గెటౌట్..." కసురుకున్నాడు. రాఘవ తన చేతిలోని కట్టలో నుండి ఇవ్వక తమను వంద ఇమ్మనే దుష్టపద్ధతి అర్థంకాక, చికాగ్గానే వంద తీసిస్తుండగా ...

"ఇతను మీకు తెలుసనుకుంటాను... విశ్వంభర... ఆ మధ్య పదిరవై సినిమాలకు బ్రహ్మాండమైన స్క్రిప్ట్ రాసి, పాటలు కూడా రాసి..."

ఒకడు చట్టుక్కున షాక్ తిన్నట్టు చూసి-

వందనోటు తీసుకుని చింపిరి జుట్టువాడు తన విస్కీ వాసనతో సహా నిష్క్రమించగానే- రాఘవ "ఒట్టి తాగుబోతు వెధవ. బిడ్డ సీరియస్‌గా ఉందట సీరియస్‌గా. అంతా కథ. వందతో పీకల్దాకా తాగి ఎక్కడో రోడ్డుమీద పడుకుంటాడు వెధవ. మనిషికి అన్నింటికన్నా భయంకరమైన బలహీనతేమిటో తెలుసా. తాగుడు. వేళకి తాగడానికి లేకుంటే నానా కథలు చెప్పి చివరికి భార్యను కూడా పరాయి వాడి దగ్గర పడుకోబెట్టే నీచమైనస్థితికి జారిపోతాడు మనిషి. అసలు వాడికప్పుడు తట్టదు తను చేస్తున్నదీ, చెప్తున్నదీ ఎంత నికృష్టమైందో. ఒకప్పుడు తారా జువ్వలా వెలిగిన మనిషి..."

"ప్చ్-" పెదవులు చప్పరించారెవరో

బయట అప్పటిదాకా అతి చల్లగా వీస్తున్న గాలి సన్నని తుంపరగా మారింది.

"సో... మనం జనవరిలో షూటింగ్ అనుకుంటున్నాం.... ఈలోగా మీరు..."

"జస్ట్ బై నవంబర్... స్క్రిప్ట్ ఇచ్చేస్తాను..."

"రైట్... ఈ అకేషన్‌ను సెలబ్రేట్ చేద్దామా మరి..." బజర్ నొక్కాడొకడు.

రాఘవ మౌనంగానే ఉండిపోయి- రాబోయే ఫారిన్ విస్కీ విందు ఏర్పాటును ఊహించుకుంటూ-

బాయ్ వచ్చాడు. భారీ ఎత్తున ఆర్డర్ చేయబడింది. పది నిమిషాల్లో గది నిండా సీసాల, గ్లాసుల గలగలలు ధ్వనించాయి.

"చీర్స్"... "చీర్స్"

సిగరెట్టు పొగలు.

చికెన్ డిషెస్ ఘుమ ఘుమలు.

ముద్దముద్ద మాటలు. పరస్పర పొగడ్తలు. సినిమా మీడియాపై తమకు గల అధికారం గురించిన ప్రగల్భాలు, ఛాలెంజ్‌లు.

మత్తు, సీసాల్లోనుండి గ్లాసులద్వారా మనసునిండా నిండి... మాటలు కోటలు దాటుతున్నాయి.

"వా...డు- విశ్వంభర... నిజంగా టాలెంటెడ్ మాన్... పవర్‌ఫుల్ పెన్‌మాన్. ఏం లాభం... తాగుడు వాణ్ణి తాగేసింది"-

"రమ్మంటే రావు కన్నీళ్ళు

కావాలి హృదయం సెలయేరు-" అని రాశాడు నాడు. వాడికే చెల్లుతుంది కొన్ని రాయడం..." చెప్పుకుపోతున్నాడు రాఘవ.

విస్కీ ఆ రాత్రి ఒంటిగంటదాకా కాలాన్నితాగేసి- అందర్నీ విశృంఖలతలో వదిలేసి విశ్రాంతిలోకి అదృశ్యమైపోయింది.

★ ★ ★

"నమస్కారం రాఘవ గారూ"

"నమస్తే"

"కసి- సినిమాలో మీరు రాసిన డైలాగ్స్ ఎంత అద్భుతంగా ఉన్నాయ్‌సర్... ఆటోగ్రాఫ్ ప్లీజ్"

పెన్. పుస్తకం... సంతకం... చిర్నవ్వు.

ఓ పులకరింత-

"విల్ యు కైండ్లీ స్పేర్ ఫ్యూ మినట్స్ ఫర్ మి సర్-"

"చెప్పండీ..."

"ఫ్రెంచ్ విస్కీతో పంచుకుంటూ కొద్దికాలం... మీ అమూల్యమైన కొన్ని నిముషాలు..."

"ష్యూర్... ష్యూర్..."

కార్ డోర్ తెరచి... స్వాగతించి...

రాఘవ ఎక్కి కూర్చుని... రిలాక్సయి.

అభిమానుల పలకరింపులు... మర్యాదలు... ఓహ్... మధురమైన విస్కీ క్షణాలు...

కారు బీచ్ గెస్ట్‌హౌస్‌లో ఆగి...

ఆమె... ఎవరో... అందమైన ఆమె... హంసలా వచ్చి...

అభిమాని పరిచయం చేశాడు ఏదో పేరుతో.

పార్టీలో ఆమె కూడా కూర్చుంది. నవ్వింది... మత్తుగా మాట్లాడింది... మత్తుగా... అప్పుడప్పుడు స్పర్శించింది... మత్తుగా,

"ఇప్పుడెన్ని సినిమాలకు రాస్తున్నార్సార్"

"ఐదు"

"మీరింకా ఇంకా... ఎన్నో సినిమాలకు రాయాలి. మీ హృదయాలకు రసానందాన్ని పంచిపెట్టాలి..." విస్కీ వంచుతోంది ఆమె గ్లాసులోకి.

'సాకి నీవు- చషకమ్ము నీవెయైన

తాగుతూనే ఉందు జీవితాంతమ్మువరకు' - ఎక్కడో అన్నాడు గాలిబ్

మధురమైన మత్తు.

విస్కీమత్తు... అభిమానం మత్తు... అందం మత్తు.

కాలం... నిముషాలు గంటలై... గంటలు జీవిత ప్రాణాణువులై.... అతన్ని దొర్లించుకుని తన్నుకు పోతున్నాయి.

తీయని తెమ్మెరలో కళ్ళు మూసుకుని ఓ సుందర స్వప్నంలో సమాధియై పోతున్నాడతను.

★ ★ ★

సభ ముగిసింది.

ఎన్ని చప్పట్లో...

మనసు నిండా పూల మాటలు... శ్రావ్యమైన ధ్వనులు... హృదయం నిండా అపూర్వమైన పరవశాన్ని నింపే మధురానుభూతులు-

"వెల్‌కం సర్... రండి మా కార్లో వెళ్దాం..."

అతనే... అభిమాని... అతని వెంట ఆమె.

మెత్తని మత్తయిన నవ్వు.

డోర్ తెరచి పట్టుకుందామె- ఎక్కాడు రాఘవ.... కార్లోకి... ఈ మధ్య అతి తరచుగా కలుస్తున్నాడు. దాదాపు ప్రతిరోజూ విందే...

కారు జారిపోతోంది... గెస్ట్ హౌజ్ దిక్కు.

స్కాచ్ ఓపెన్ చేసి... ఆమె అందమైన గ్లాస్‌లో వంచుతోంది. ధారలు ధారలుగా అందం... ఆనందం... ఆనందామృతం.

అసలీ విస్కీలో ఉందా మత్తు.

ఆమెలో ఉందా మత్తు.

ఆమె... అతను... తనను అభిమానించే అనుభూతిలో ఉందా మత్తు....ప్చ్.

ఎక్కడో ఓ అద్భుతమైన పారవశ్యత దిక్కు కొట్టుకుపోతూ- ఏమిటి రసానుభవం.

గంటలకు గంటలు... ఇదే మధురానుభావాన్ని కోరుతూ మనసు మారాం చేస్తోంది. ప్రతి సాయంకాలం... ఈ సంధ్య దాటి చిరుచీకటి కమ్మగానే ఓ అవులింత... ఓ దాహం... ఓ తప్తత....

ఒకవేళ ఈ ఏర్పాట్లు లేకుంటే- ఏదో శూన్యత. ఏటో నిస్సత్తువతో గాలిలో కాగితం ముక్కవలె కొట్టుకు పోతున్నట్లు వికారమైన ఫీలింగ్.

విస్కీ సీసాలో మునిగి ఒడ్డుకు ప్రాకుతూ తీరం అందక మళ్ళీ మళ్ళీ జారిపోతున్నాడా... అరిపోతున్నాడా...

ప్చ్... జానేదేవ్... ఈ రోజు స్వర్గం ఈ రోజే....

విస్కీ వంచుతోందామె...

కళ్ళలో కలలు విచ్చుకుంటున్నాయి.

★ ★ ★

సముద్రం తీరంపై పోరాటం చేస్తూనే ఉంది అలల ఆయుధాలతో.

నడుస్తున్నారు ముగ్గురూ ఇసుకలో.

అతను- ఆమె.

మూడవ వ్యక్తి రాఘవ కాదు. రాజా.

"ఈ ఎనిమిది నెలల్లో మనకైన ఖర్చెంత..."

"పన్నెండు వేలు..."

"ఆ రాఘవ గాడిని ఎంత దూరం పతనం చేయగలిగారు"

"రోజుకు ఐదు గంటల చొప్పున- ఇన్ని నెలలు వాణ్ణి వాని రచనా వ్యాసంగం నుండి తప్పించి మెదడులో ఓ తుఫాన్ను సృష్టించి... బయట వాడు బాగా తాగుతున్నాడనీ, రాయడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడన్న అపవాదుని సృష్టించాం."

"దట్స్ గుడ్-"

"నౌ హి ఈజ్ కిల్డ్... బ్రహ్మాండమైన ప్రతిభతో చొచ్చుకొస్తున్న రాఘవని బలహీనతల ఊబిలో బంధించి- టైమును క్యాష్ చేసుకోవాల్సిన వాని కాలాన్ని నిరుపయోగం చేసి వాణ్ణి చంపాం... వానికి రావల్సిన ఆఫర్లలో వందశాతం సినిమా ఛాన్సలను నేను కొట్టేశాను. గుడ్ మై ఫ్రెండ్స్... థ్యాంక్యూ. వాడు కోల్పోయిన సినిమాల విలువ లక్షా నలభైవేలు. మనం వాడి ప్రొఫెషనల్ మర్డర్‌కు పెట్టిన పెట్టుబడి పన్నెండు పదిహేను వేలు. కమాన్ హావిట్-" రాజా కొత్త నోట్ల కట్టలను అందించాడామెకు.

ఆమె అవి అందుకుంటూండగా-

వెనుక నుండి

"నీలా..." అని రాఘవ బిగ్గరగా పిలుస్తూ వస్తున్న చప్పుడు వినబడింది.

"ఇక వీడు- తాగుడు లేకుండా ఉండలేని స్థితికివస్తున్నాడు. వీలు చూచుకుని కట్ చేసెయ్యండి. తెర దించెయ్యండి..." రాజా వెళ్తున్నాడు గబగబా. వెనుకనుండి 'నీలా' పిలుపు దగ్గరవుతోంది. అతను- ఆమె ఆగి....

ఆమె చూపుల నిండా నవ్వులతో రాఘవ దిక్కు చూస్తోంది.

రాఘవ ఇసుకలో తొందర తొందరగా రాబోయి దభేలున పడిపోయాడు.... కళ్ళనిండా... నోటినిండా ఇసుక....

'ఉదయం' వారపత్రిక

27, నవంబర్ 1986